అక్కరకు రాని కల్వర్టు

» జీలుగుమిల్లి -పి.రాజవరం గ్రామాల మధ్య వాగుపై రూ.14 లక్షల నిధులతో నిర్మాణం
» వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు.. రోడ్డు వేయకపోవడంతో వాహనదారుల పాట్లు


జీలుగుమిల్లి - పి.రాజవరం మధ్య నిర్మించిన కల్వర్టు

జీలుగుమిల్లి, జూలై 13: (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి నుంచి పి.రాజవరం మీదుగా టి.నరసాపురం, అలాగే వయా చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి గోతులమయం కావడంతో దశాబ్ద కాలంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రివేళ ద్విచక్రవాహనంపై ఈ రహదారి గోతుల్లో వెళ్లే వారి దుస్థితి ఇక వర్ణనాతీతం. దీనికి తోడు నాలుగు చినుకులు పడితే గోతుల్లో నీళ్లు నిలిచి గొయ్యిలు కన్పించక ప్రమాదాల బారిన పడుతున్నారు. జీలుగుమిల్లి-పి.రాజవరం గ్రామాల మధ్య ఉన్న వాగు వర్షాకాలంలో తరచూ పొంగి ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ఎంపీ నిధులు రూ.14 లక్షలు ఖర్చు చేసి కల్వర్టు నిర్మించారు. అయితే రోడ్డు నిర్మాణం గాలికి వదిలేశారు. వాగు వరద నీరు వెళ్లేందుకు కల్వర్టు ఎత్తు పెంచి కట్టారు. అందుకు తగ్గట్టుగా ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేయలేదు. దీంతో వాహనదారులు కల్వర్టు పక్క నుంచి తాత్కాలిక మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కల్వర్టు నిరుపయోగంగా మారింది. కల్వర్టు పైనుంచి వాహనాలు రాకపోకలు సాగడం లేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక కొద్దిరోజుల కిందట కాంట్రాక్టర్ ఇరువైపులా గ్రావెల్ మట్టిపోసి వదిలేశాడు. ప్రస్తుతం వాగుకు వరద వస్తే కల్వర్టు ఇరువైపులా ఉన్న మట్టి కాస్త గంగపాలు కావడం ఖాయం. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ రామాంజనేయుల్ని అడగ్గా ఈ రహదారికి రూ.3 కోట్లు నాబార్డు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.


రోడ్డును కల్వర్టును కలుపుతూ ఇటీవల పోసిన గ్రావెల్ మట్టి.. కల్వర్టు పైనుంచి వెళ్లేందుకు వీలు లేక పక్కన వాహనదారులు ఏర్పాటు చేసుకున్న దారి


చిల్డ్రన్ ట్రాఫిక్ పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కు ప్రారంభం

ఏలూరుటూటౌన్/ఏలూరు క్రైం, జూలై 13(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదాల నివారణ కోసం విద్యార్థిదశ నుంచే అవగాహన కలిగించేందుకు రూ.84 లక్షలతో చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కును ఏర్పాటు చేశామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్మించిన చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు సెఫ్టీపై అవగాహన కోసం పార్కును నిర్మించామన్నారు. ఈ పార్కులో ఆటల ద్వారానే ట్రాఫిక్ రూల్స్ నేర్చుకునే విధంగా నిర్మాణం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్పీ కె.ప్రతాప్‌శివకుమార్, జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ చిన్నవయస్సులోనే ట్రాఫిక్ చట్టాలు, బాధ్యతలు అర్థం చేసుకునేందుకు ఈ పార్కు దోహదపడుతుందన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కో ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ బాబు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు. కాగా పార్కులో టేక్‌బుక్- రేట్‌బుక్ అనే ప్రత్యేక స్టాల్‌ను జేసీ ఏర్పాటు చేశారు.


పెద్దింటమ్మకు బోనాలు తీసుకువెళుతున్న హిజ్రాలు

పెద్దింటమ్మకు హిజ్రాలు బోనాలు

కైకలూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి తెలంగాణకు చెందిన హిజ్రాలు బోనాలు సమర్పించి దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం 12 మంది హిజ్రాలు సన్నాయి మేళాలతో ఊరేగింపుగా బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరకుని పాలపొంగళ్ళను, పట్టువస్త్రాలను అమ్మవారికి అందజేశారు. హిజ్రాలు అమ్మవారికి మొట్టమొదటిసారిగా బోనాలు సమర్పించినట్లు అర్చకులు పేర్కొంటున్నారు. ఆదివారం కావడంతో కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిం చారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు నిర్వహించి హిజ్రాలకు పసుపుకుంకు, గాజులను అందజేశారు.

సార్వా సజావుగా సాగేనా!

» మందగించిన నైరుతి రుతుపవనాలు
» వర్షాల జాడ అంతంత మాత్రమే
» ఎండ వాతావరణంతో వరి చేలల్లో జింక్‌ధాతు లోపం



ఏలూరుసిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి):సార్వా సాగు జిల్లాలో సజావుగా సాగేనా అన్న పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో కురిసిన వర్షాలు, గోదావరి, కృష్ణా డెల్టాలకు సాగునీరు విడుదల చేయడంతో జిల్లాలో సార్వా సాగు పనులు ఈ ఏడాది ముందస్తుగానే ప్రారంభ మయ్యాయి. అయితే వారం రోజులుగా నైరుతి రుతుపవనాలు జాడ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఈ నెల ఆరంభంలో బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు కారణంగా వర్షాలు కురిసినా ఆ తర్వాత వర్షాలు జాడ లేదు. మరో పక్క గోదావరి పశ్చిమ డెల్టాకు, కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదల చేసినా ఎండల తీవ్రత కారణంగా పలు చోట్ల నారుమడులు ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

2.22 లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో 2,22,348 ఎకరాల్లో సార్వా వరి సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్ణయించుకుంది. దీనికి తగ్గట్టుగా 11వేల 117 ఎకరాల్లో వరి నారుమళ్లు వేయాల్సి ఉండగా 7,283 ఎకరాల్లో వరి నారుమళ్లు పూర్తయ్యాయి. నారుమళ్లు ముమ్మరంగా సాగినా వరి నాట్లు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. జిల్లాలో ఇంతవరకు 8,222 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పూర్తయింది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కొద్దిపాటి వర్షాలు కురుస్తుండగా మిగిలిన ప్రాంతాల్లో వేసవిని తలపించే స్థాయిలో ఎండలు మండుతున్నాయి. వారంరోజులుగా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇవే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. జిల్లాలో సార్వా వరి సాగులో ఎండల వాతావరణం కారణంగా వరి సాగులో సాగునీటి ఇబ్బందులతో పాటు జింక్‌లోపం పలు చోట్ల కనిపిస్తోందని చెబుతున్నారు. సార్వా సాగులో వాతావరణం అనుకూలించకపోతే దిగుబడులపై ప్రభావం చూపిస్తుందని రైతులు పేర్కొంటున్నారు

ఇతర పంటలు అంతంతే..

జిల్లాలో సార్వాలో పండించే ఇతర పంటలైన జొన్న, మొక్కజొన్న అపరాలు పంటలు వేరుశనగ, నువ్వులు, చెరకు, ప్రతి పంటలు అంతంత మాత్రమే సాగవుతున్నాయి. మొక్కజొన్న 82 ఎకరాల్లో, పత్తి 1,750, చెరకు 197 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఇక అపరాలు స్వల్పంగానే సాగు చేపట్టారు.

పశుబీమా.. రైతులకు ధీమా!



» వైసీపీ పాలనలో నిలిచిపోయిన పథకం
» టీడీపీ ప్రభుత్వం రాకతో పునరుద్ధరణ
» పశుపోషకుల్లో ఆనందం

ఏలూరు టూటౌన్,జూలై 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమ పైనే ఆధారపడి జీవిస్తుంటారు. పాలిచ్చే పశువులు ఏదైనా కారణం చేత చనిపోతే ఆ కుటుంబం ఆర్థికంగా దెబ్బతింటుంది. అందుకే గతంలో టీడీపీ ప్రభుత్వం పశుబీమా పథకం ప్రవేశపెట్టి ఎంతో మంది రైతులను ఆదుకుంది. అనంతరం అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయక పోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ ప్రభుత్వం తిరిగి పశుబీమా పథకాన్ని ప్రారంభించింది. బీమా పథకంలో ఇన్సూరెన్స్ సొమ్ములు ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం, మిగి లిన రైతులకు 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రోత్సా హం అందించింది. మేలుజాతి పశువులకు రూ.30 వేలు బీమా సదుపాయం, మాములు పశువులకు రూ.15వేలు బీమా సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం రూ.లక్ష లేనిదే పాడిపశువు రావడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని రూ.లక్షా 10 వేల వరకు బీమా సదుపాయం ప్రభుత్వం కల్పించింది. మేకలు, గొర్రెలు పందులకు సైతం బీమా సౌకర్యం కల్పించారు. 50 గొర్రెలు, 50 మేకల వరకు బీమా చేయించుకోవచ్చు. జిల్లాలో ఇప్పటి వరకు 2,192 ఆవులు, గేదెలకు ఇన్సూరెన్స్ చేశారు. వీటి ఖరీదు రూ.5.45 కోట్లుగా విలువ కట్టారు. ఈ రైతులకు ఇప్పటి వరకు రూ.31 లక్షలు సబ్సిడీ ప్రీమియం ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించింది. ఏడాది కాలంలో 250 పశువులు మరణించగా దాదాపు రూ.50 లక్షల సొమ్మును నష్టపరిహారంగా చెల్లించారు.

బీమాకు దరఖాస్తు ఇలా..

రైతులు పశువైద్యశాలల్లో సంప్రదించి బీమా చేయించుకోవాలి. రైతు బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డు కలిగి ఉండాలి. ఎస్సీ,ఎస్టీలకు 80 శాతం సబ్సిడీ ఇస్తున్న నేపథ్యంలో తెల్లరేషన్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. బీమా చేసిన పశువుకు చెవిపోగు ట్యాగ్ వేస్తారు. ఏదైనా కారణాల వల్ల పశువు చనిపోతే పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా కంపెనీ అధికారులు వచ్చే వరకు చెవిపోగు ఉంచితేనే పశు బీమా వర్తిస్తుంది.

రూ.15వేలు పశువుకు ఎస్సీ, ఎస్టీలైతే వాస్తవానికి రూ.768 ప్రీమియం చెల్లించాలి. కానీ రూ.192 చెల్లిస్తే సరిపోతుంది. రూ.30 వేల పశువుకు రూ.1536 ప్రీమియం చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.384 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రైతులకు 50 శాతం ప్రీమియం రాయితీ లభిస్తుంది. గొర్రెలు, మేకలు రూ.6వేలు విలువగల వాటికి రూ.135 ప్రీమియం చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.54 చెల్లిస్తే సరిపోతుంది. ఈ బీమా మూడేళ్ల వరకు వర్తిస్తుంది. జిల్లాలో లక్షా 35వేల 706 తెల్ల పశువులు, 5,06,110 నల్లపశువులు, గొర్రెలు 5,71,231, మేకలు 2,34,793 ఉన్నాయి.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి



పశుబీమాను రైతులు సద్వినియోగించుకోవాలి. ప్రభుత్వం 50-80 శాతం వరకు ప్రీమియం భరిస్తుం ది. ఎస్సీ, ఎస్టీలు 20 శాతం, మిగిలిన వారు 50 శాతం ప్రీమియం కడితే సరిపోతుంది. పశువు మృత్యువాత పడినప్పుడు బీమా వర్తించి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. పశుబీమాపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

- డాక్టర్ టి.గోవిందరాజు,జేడీ



కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తగ్గిన గోదావరి ఉధృతి

శాంతించింది!

» తగ్గుముఖం పట్టిన గోదావరి
» దాచారం పునరావాస కాలనీలో 250 కుటుంబాలు
» సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు
» పట్టిసీమ క్షేత్రం చుట్టూ వరద జలాలు

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం,జూలై13(ఆంధ్రజ్యోతి): గోదావరి శాంతించింది. ఏజెన్సీ వాసుల్లో గోదావరి భయం వీడింది. ముంపు మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. శనివారం సాయంత్రం 41.30 అడుగుల నీటిమట్టం ఉన్న గోదావరి ఆదివారం ఉదయానికి 36.70 అడుగులకు తగ్గింది. సాయంత్రానికి 32 అడుగులకు చేరుతూ క్రమంగా తగ్గుతోంది. గొమ్ముగూడెం నుంచి దాదాపుగా ఆ గ్రామస్థులను ఇళ్లను ఖాళీ చేసి దాచారం పునరావాస కాలనీకి తరలించారు. లచ్చిగూడెం నుంచి పదికుటుంబాలు పునరావాస కాలనీకి తరలివెళ్లారు. బాధితకుటుంబాలకు పునరావాస కాలనీలో భోజనం అందిస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎండీ రమణ, కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో నరసింహారావు పునరావాస కాలనీలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికి తీరం వైపు ఎవరూ వెళ్లకుండా కుక్కునూరు పోలీసులు కంచెను ఏర్పాటు చేశారు.


నీటిమునిగిన కడెమ్మ స్లూయిజ్ గేట్లు


కుక్కునూరు గోదావరి తీరం వైపు ప్రజలు వెళ్లకుండా రహదారిపై ముళ్లకంచె


దాచారం పునరావాస కాలనీలో బాధితులకు భోజన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో ఎంవీ.రమణ

జూలై వస్తుందంటేనే గుబులు

జూలై వస్తుందంటేనే ముంపు మండలాల ప్రజల గుండెల్లో గుబులు రేగుతోంది. గతంలో 2022, జూలై 11 నుంచి వరద పెరగడం మొదలై 13వ తేదీకి గ్రామాలను వరద ముంచెత్తింది. మరలా అదే పరిస్థితులు పునరావృతం అయ్యేలా ఈనెల 11 నుంచి గోదావరికి వరద పోటె త్తింది. మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరువలో వరద రావడంతో అధికారులు అప్రమత్తమై గ్రామాలను ఖాళీ చేసేలా చర్యలు ప్రారంభించారు. వేలేరుపాడు మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ జయరాజు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ ఇక్కడే మకాం వేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు (మిగతా 8వ పేజీలో)

గట్టు..గుబులు!

ప్రమాదకరంగా పట్టిసీమ ఫెర్రీ గట్టు.. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్య


కోతకు గురైన గట్టు అంచున సచివాలయ భవనం

పోలవరం, జూలై13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ శివక్షేత్రంగా పేరొందిన పట్టిసీమ ఫెర్రీ రేవులో గోదావరి గట్టు వరద జలాల తాకిడికి కోతకు గురై ఫెర్రీ రేవులో ఉన్న సచివాలయం, గ్రామ రెవెన్యూ కార్యాలయం, పోలీస్ గెస్ట్‌హౌస్‌లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. 2021 జూలైలో వచ్చిన వరదలకు పట్టిసీమ ఫెర్రీ రేవు గట్టు పట్టిసీమ వద్ద నూతనంగా నిర్మించిన కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ స్పిల్‌వే వైపు ప్రమాదకర స్థాయిలో కోతకు గురయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటా కొవ్వాడ కాలువ వరద జలాలు, గోదావరి వరద తాకిడికి గట్టు పూర్తిగా ప్రమాదకర స్థాయిలో కోతకు గురైంది. రేవులో ఉన్న సచివాలయ భవనానికి సమీపంలో ఆరు అంగుళాల ఖాళీ మాత్రమే మిగిలి ఉండేలా కోతకు గురయ్యింది. ఈ ఏడాది కొవ్వాడ కాలువ, గోదావరి వరదలకు వచ్చే వరద జలాల తాకిడికి మిగిలిన గట్టు కోతకు గురైతే సచివాలయం, గ్రామ రెవెన్యూ కార్యాలయం ఉన్న భవనం కొవ్వాడ స్పిల్‌వేలోకి పడిపోయే అవకాశాలు ఉన్నాయి. గత నాలుగేళ్లగా పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు జరిపే ముందుస్తు సమీక్షా సమావేశాల్లో కలెక్టర్, జేసీ, ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవోతో సహా ఎంతో మంది అధికారులు గట్టుకి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు చేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. గట్టు కోతపై ఏప్రిల్ 10, 2023న 'గోదారి గట్టు కోత' శీర్షికన వార్తా కథనం వచ్చింది. కొవ్వాడ కాలువ ఏఈ రాహుల్ భాస్కర్‌ని అప్పట్లో వివరణ కోరగా కొవ్వాడ కాలువ స్పిల్‌వేకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.రెండు కోట్లతో నివేదిక పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు గట్టుకి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది వరద జలాల తాకిడికి మిగిలిన గట్టు కూడా క్రమక్రమంగా కోతకు గురవుతోంది.

ఉమ్మడి పశ్చిమతో 'కోట' అనుబంధం
■ లోపలి పేజీలో..


పోలీసు జాగిలంతో వాహనాలను తనిఖీ చేయిస్తున్న పెదవేగి సీఐ రాజశేఖర్

కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం/పెదపాడు, జూలై13 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏలూరు జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టిందని పెదవేగి సీఐ సిహెచ్ రాజశేఖర్ అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు నూజివీడు డీఎస్పీ కేవీవీ ఎన్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో పెదవేగి సీఐ రాజశేఖర్ సిబ్బందితో ఆదివారం రాత్రి ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలను తనిఖీలు చేశారు. గంజాయి, మత్తుపదార్థాలు, అక్రమ మద్యం నివారించడానికి ఈ తనిఖీలు చేశారు. పోలీసు జాగిలాలతో వాహనాలను, బస్సుల్లోని ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 16వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. టోల్‌గేట్, పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించినట్టు పెదపాడు ఎస్ఐ కట్టా శారద సతీష్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో 4,340 మందికి అడ్మిషన్లు

నూజివీడు టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నూజివీడు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో గల నాలుగు క్యాంపస్‌లలో ప్రత్యేక కోటా మినహా ప్రధాన అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమ రేంద్ర కుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లో మొత్తం 4,400 ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సీట్లకు ప్రత్యేక కేటగిరీ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 4,340 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. విద్యార్థుల సౌలభ్యాన్ని గమనించి అంతర్గత బదిలీలు నిర్వహించగా 384 మంది తమ క్యాంపస్‌లను పరస్పరం మార్చుకున్నారు. అడ్మిషన్లు పొందిన వారు ఈనెల 17వ తేదీ సంబంధిత క్యాంపస్‌లో రిపోర్టు చేయాలన్నారు. స్పోర్ట్స్ కోటాలో 20సీట్లు, ఎన్‌సీసీ కోటాలో 40 సీట్లు భర్తీ చేయాల్సి ఉందని ఈ సీట్ల భర్తీకి సంబంధించి వచ్చే వారంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

దిగి వస్తున్న అపరాలు

నిలకడగా ఉల్లి, కూరగాయల ధరలు



తాడేపల్లిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో అపరాల ధరలు దిగి వస్తున్నాయి. గత సంవత్సరంలో పోల్చుకుంటే కిలోకు రూ.40 తగ్గాయి. ప్రధానంగా కంది పప్పుధరలు పోల్చుకుంటే కిలో రూ.95 నుంచి 105 వరకు ధర ఉంది. మొదటి రకం కందిపప్పు రూ.105కు విక్రయి స్తున్నారు. ఇదే రకం కందిపప్పు గతేడాది కిలో రూ.160 వరకు వెళ్లింది. మిన ప్పప్పు కూడా ప్రస్తుతం రూ.80 నుంచి 100 మధ్య విక్రయిస్తున్నారు. గత సంవత్సరం రూ.125 వరకు విక్రయాలు జరిగాయి. పెసరపప్పు రూ.95, పచ్చి శనగపప్పు రూ.75కు అమ్ముతున్నారు. మొన్నటివరకు ఇది కిలో రూ.85 అమ్మే వారు. ఇలా చూస్తే దాదాపు అపరాలు ధరలు తగ్గాయి.

నిలకడగా కూరగాయల ధరలు :

కూరగాయల ధరలు నిలకడగానే ఉన్నాయి. గత వారంతో పోల్చుకుంటే ధరల్లో వ్యత్యాసం లేదు. తెల్లవంకాయలు రూ.80, నల్లవి రూ.60, గోరు చిక్కుడు రూ.60, దోస రూ.40కి విక్రయిస్తున్నారు. దాదాపు కూరగాయల ధరల్లో పెద్ద వ్యత్యాసం లేదు.ఉల్లి హోల్‌సేల్ ధరలో క్వింటా రూ.2150 అమ్ము తున్నారు. రిటైలర్స్ మాత్రం నాలుగు కిలోలు ఉల్లి రూ.100కు, 10 కిలోల బస్తా రూ.250కు విక్రయిస్తున్నారు. గతవారం నాణ్యమైన ఉల్లి 50 కిలోల బస్తా రూ.1200కు విక్రయించారు. హోల్‌సేల్‌లో ధరలు తగ్గినా రిటైలర్స్ మాత్రం తగ్గించడం లేదు.



పోటీల్లో మెడల్స్ సాధించిన సరస్వతీ విద్యాలయ విద్యార్థులు

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో సరస్వతీ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు విభాగాల బాస్కట్ బాల్ పోటీలలో ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయ్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారని పాఠశాల చైర్మన్ కొలనువాడ వెంకట హనుమ సత్యనారాయణరాజు తెలిపారు. ప్రత్తిపాడు సరస్వతీ విద్యాయల పాఠశాలలో కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్ (సీఐఎస్ సీఈ) రాష్ట్ర స్థాయి అండర్ 14, 17, 19 విభాగాలలో బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటీలకు రాష్ట్రం నుంచి జోన్ల వారీగా విజయవాడ, విశాఖ పట్టణం, అమలాపురం, రావులపాలెం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారని చైర్మన్ వెంకట్ తెలిపారు. పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడు విభాగాలలోనూ బంగారు, కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కొలనువాడ స్వాతి అన్నపూర్ణ, కోచ్ సత్యకిరణ్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



అనివేటి మండపంలో భక్తుల రద్దీ

కిటకిటలాడిన చిన వెంకన్న ఆలయం

ద్వారకాతిరుమల,జూలై 13 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. 15 వేల మందికి పైబడి యాత్రికులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది.



పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం, జూలై 13: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఈఈ యేసుబాబు ఆదివారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీటి విడుదల చేసినట్లు తెలిపారు. కృష్ణా ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోటార్లు, పంపుల సంఖ్య పెంచామన్నారు.



గండిపడిన చినలంక వంతెన పరిశీలిస్తున్న పాత్తూరి

చినలంక అప్రోచ్‌కు గండి

నరసాపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినలంక, పీఎంలంక మార్గాలను కలిపే వంతెన అప్రోచ్ రహదారి కోతకు గురైంది. పోటు, పాటుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్‌కు గండిపడింది. దీంతో సగం రోడ్డు నల్లిక్రిక్ పాయిలో కలిసిపోయింది. మరో కొద్దిసేపు గడిస్తే మిగిలిన రోడ్డు కూడా కోతకు గురయ్యే ప్రమాదం ఉందని గుర్తించిన గ్రామస్థులు వెంటనే టీడీపీ ఇన్‌చార్జి రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలికంగా పంచాయతీ సిబ్బంది రాళ్లతో కోతకు గురైన ప్రదేశంలో అడ్డుకట్ట వేశారు. ఆనంతరం రామరాజు మాట్లాడుతూ కీలకమైన ఈ రోడ్ మరమ్మతు పనులతో పాటు వంతెన పనుల్ని కూడా చేపడతామన్నారు. నల్లిక్రిక్ పనుల్లో భాగంగా దీన్ని పూర్తి చేస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాతో 'కోట' అనుబంధం

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతితో గోదావరి వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు.. ఆయన సినిమా షూటింగ్‌ల కోసం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు విచ్చేశారు.. ఆ సమయంలో స్థానికులను ఎంతో ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు. కళాకారులకు ఎంతో గౌరవం ఇచ్చేవారని కళారంగంలో ఉన్నవారు ఆయనను స్మరణకు తెచ్చుకున్నారు.

పోలవరంలో సినిమా షూటింగ్‌లకు..

పోలవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పోలవరం పరిసర ప్రాంతాల్లో నిర్మించిన ఎన్నో సినిమాల్లో కోట శ్రీనివాసరావు నటించారు. వాటిలో సీతారామయ్యగారి మనవరాలు, రాజేశ్వరి కళ్యాణం, తాండ్ర పాపారాయుడు సినిమాలు కొన్ని. 2006 సంవత్సరంలో కృష్ణవంశీ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్, ఇలియానా చార్మి నటించిన రాఖీ సినిమా షూటింగ్ పోలవరం మండలం పట్టిసీమ, టేకూరు గ్రామాల్లో నిర్మించారు. ఆ సినిమా షూటింగ్ కోసం పట్టిసీమ వచ్చిన కోట శ్రీనివాసరావుకి అప్పట్లో షూటింగ్ చూడడానికి వచ్చిన స్థానికులతో పోలవరం పరిసర ప్రాంతాల ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. షూటింగ్ విరామ సమయంలో వారితో ముచ్చట్లాడి స్థానిక విశేషాలు తెలుసుకునేవారని, పట్టిసీమ శివక్షేత్రం విశేషాలు అడిగేవారని, స్థానిక వంటలు సంప్రదాయాల గురించి, స్టేజ్ ఆర్టిస్టుల వివరాలు అడిగి తెలుసుకునేవారని పట్టిసీమ, టేకూరు గ్రామస్థులు తెలిపారు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారని సినీ పరిశ్రమలో ఆయన లేని లోటు తీర్చలేనిదని గ్రామస్థులు తెలిపారు.

గూడెం బీజేపీ నాయకులతో సంబంధాలు



తాడేపల్లిగూడెంలో బీజేపీ నాయకుడు ఆనంద్ కుమార్తె పుట్టినరోజు వేడుకల్లో..

తాడేపల్లిగూడెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోట శ్రీనివాసరావుకు తాడేపల్లిగూడెంతో ప్రత్యేక అనుబంధం ఉంది. రాజకీయపరమైన ప్రచారంలో 1999 తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి తాడేపల్లిగూడెంలో రైల్లో ఆయన ఇక్కడికి వచ్చారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా బీజేపీ తరపున నెగ్గిన ఆయన తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరుపున ప్రచారానికి వచ్చారు. జీకే కాన్ఫరెన్స్‌హాల్లో కొద్ది సేపు బసచేశారు. అప్పటి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రి ప్రభాకర బాలాజీ, పైడికొండల మాణిక్యాలరావు, జీకే ఆనంద్, గట్టిం మాణిక్యాలరావు, కొండపల్లి నగేష్‌లుతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. జీకే కాన్ఫరెన్స్ హాల్లో జీకే ఆనంద్ కుమార్తె పుట్టిన రోజున పాల్గొని కేక్ తినిపించారు. అప్పటి నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని బీజేపీ నాయకులతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఫోన్ చేసిన వెంటనే స్పందించడంతో పాటు తాడేపల్లిగూడెం నుంచి ఇక్కడ కార్యకర్తలు హైదరాబాద్‌లో వెళితే వైద్యసేవలు అందించేందుకు సాయపడేవారని బీజేపీ నాయకులు గట్టిం మాణిక్యాలరావు, జీకే ఆనంద్‌లు చెప్పారు.

పాలకొల్లులో కళాకారుల సన్మానం

పాలకొల్లు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కళలకు నిలయమైన పాలకొల్లులో 1996లో సన్మానం అందుకున్నారు. ప్రముఖ సినీ దర్శకుడు, పాలకొల్లు వాసి కోడి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే లలిత కళాంజలి నాటక అకాడమీ 16వ వార్షికోత్సవం సందర్భంగా 1996లో నిర్వహించిన జాతీయస్థాయి నాటికల పోటీల చివరి రోజున బీవీఆర్ఆర్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో కోట శ్రీని వాసరావును ఘనంగా సత్క రించారు. ఆయన మృతికి పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కెవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, డాక్టర్ వర్మ, వెంకట రమణ, వ్యవస్థాపకుడు మానాపురం సత్యనారాయణ, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఏలూరు వైఎంహెచ్ఏలో సత్కారం

ఏలూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కోట శ్రీనివాసరావు మృతి కళారంగానికి తీరని లోటనీ కళారత్న కెవీ సత్యనారాయణ సంతాపం తెలిపారు. 700 పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి, ప్రత్యేకత నిలుపుకున్న కళాకారుడు కోట శ్రీనివాస్‌ని ఏలూరులో వైఎంహెచ్ఏ హాల్లో జరిగిన వేడుకల్లో ఘనంగా సత్కరించినట్లు ఆయన తెలిపారు. వైఎంహెచ్ఏల్లో కోట శ్రీనివాస్‌రావును సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.



పట్టిసీమలో రాఖీ చిత్రం షూటింగ్‌లో కోట శ్రీనివాసరావు

మావుళ్లమ్మ ఉత్సవాల్లో సువర్ణ హస్తా కంకణంతో సత్కారం

భీమవరం టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) :1991లో మావుళ్ళమ్మ వార్షిక మహోత్సవాల్లో ఆయనను సువర్ణ హస్తా కంకణంతో ఘనంగా సత్కరించారు. అమ్మవారిని దర్శించుకుని ఎంతో తన్మయత్వం చెందారని ఆనాటి రోజులను నిర్వాహకులు తలచుకున్నారు. అదే విధంగా 2010లో డీఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన చైతన్య బారతి సంగీత, నృత్యనాటక పరిషత్ ఆధ్వర్యంలో జరిగే జాతీయస్థాయి నాటక పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా నిర్వాహకులు ఆయను ఘనంగా సత్కరించారు.



భీమవరం మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం(ఫైల్)

ఎంపీఈవోలకు రెన్యువల్ కష్టాలు

ప్రతీ ఏడాది తప్పని తిప్పలు

నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్

ఏలూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఎంపీఈవోలకు రెన్యువల్ కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతీ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు రెన్యువల్ చేస్తూ జీవో జారీ చేయాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు గడిచినా 2005-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట ప్రభుత్వం రెన్యువల్ జీవో జారీ చేయకపోవడంతో బాధిత ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం రైతు సేవా కేంద్రం

ఉమ్మడి జిల్లాలో 47 మంది ఎంపీఈవోలు

వ్యవసాయశాఖ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 47 మంది ఎంపీఈవోలు పనిచేస్తున్నారు. 724 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీరికి నెలకు రూ.12 వేలు వేతనంతో పాటు మరో రూ.3 వేలు ఇన్సెంటివ్ అందిస్తున్నారు. అయితే గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 2015 సంవత్సరంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంపీఈఓలను ఉద్యోగంలోకి తీసుకున్నారు. అప్పట్లో ప్రతీ ఏడాది సకాలంలో రెన్యువల్ జీవోను జారీ చేసేవారు. అయితే గత వైసీపీ పాలనలో ప్రతీ ఏడాది నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో ఇస్తూ వచ్చారు. దీంతో ప్రతీ ఐదు నెలలు వేతనాలు పెండింగ్లో పెడుతూ వచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరినా వారి కష్టాలు తీరలేదు. కమిషనరేట్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే జిల్లా వ్యవసాయ అధికారులతో ఎంపీఈవోల వివరాలు తెప్పించుకుని, ప్రభుత్వానికి రెన్యువల్ కోసం ఫైల్ పెట్టడంతో రాష్ట్ర కమిషనరేట్ అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెన్యూవల్ ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో 47 మంది ఎంపీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. అయినా రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా వేతనం ఇవ్వడం లేదు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం సిబ్బంది నెలకు రూ.34 వేలు వేతనం పొందుతున్నారు. ఎంపీఈవోలకు నెలకు రూ.12 వేలతో పాటు ప్రోత్సాహక రుసుం రూ.3 వేలు అందిస్తున్నారు. ఎంపీఈవోల పనితీరు బాగుందని వ్యవసాయధికారి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తేనే రూ.3 వేలు ప్రోత్సాహక రుసుం అందిస్తారు. లేదంటే ఆ సొమ్ము రాదు. రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమానంగా పనులు చేస్తున్న తమకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని ఎంపీఈవో సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

• సమాన వేతనం ఇవ్వాలి



రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈవోలు పని చేస్తున్నారు. వారికి నెలకు అన్ని రకాల అలవెన్సు కలిపి రూ.34 వేలు వేతనం ఇస్తున్నారు. గత పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఈవోలకు నెలకు రూ.12 వేలతో పాటు రూ.3 వేలు ప్రోత్సాహక రుసుం ఇస్తూన్నారు. మినిమం టైం స్కేల్ వర్తింపజేసి, సమాన పనికి సమాన వేతనం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని ఎంపీఈవోలను ఆదుకోవాలి. సీఎం చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడులు ప్రత్యేక చొరవ తీసుకుని ఎంపీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

- జి.ఫణికుమార్, ఏపీ ఎంపీఈవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

• సకాలంలో రెన్యువల్ చేయాలి



గత ప్రభుత్వ హయాంలో నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో జారీ చేస్తూ వచ్చారు. దీంతో ఐదు నెలల పాటు వేతనాలు ఆలస్యంగా వచ్చేవి. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రెన్యువల్ జీవో జారీ చేయడంలో జాప్యం జరుగుతోంది.నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో బయట వ్యక్తులతో అప్పులు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఇప్పటి నుంచైనా సకాలంలో రెన్యువల్ జీవో జారీ చేసి, ప్రతీ నెలా వేతనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.అజయ్, ఎంపీఈవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి



పుష్కరాల పనులపై నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పుష్కరాలకు ఏం కావాలి ?

నియోజక వర్గస్థాయి అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

పాలకొల్లు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్క రాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సమన్వయంతో విజయ వంతంగా పూర్తి చేద్దామని రాష్ట జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు రామచంద్ర గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి 2027లో వచ్చే గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి కూటమి నాయకులు, నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ పుష్కర అభివృద్ధి పనులు ఏమేం చేపట్టాలి ? ఎన్నినిధులు అవసరం ? పనులు పూర్తి కావ డానికి ఎంత సమయం అవసరం ? అన్న అంశాలపై ప్రణాళికలు రూపొం దించాల్సి ఉందన్నారు. శాఖల వారీగా చేపట్టవలసిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కూటమి నాయకులు, అధికారులు ప్రతిపాదించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. 2027 జూలై 23వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ పుష్కరాలు జరుగుతాయని మహా కుంభ మేళాకు దీటుగా వీటిని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో దాసిరాజు, తహసల్దార్ దుర్గా కిషోర్, కమిషనర్ విజయ సారధి, పోడూరు, యలమంచిలి తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఇంజనీరింగ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల సేవా సంఘం అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు



పాలకోడేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల సేవా సంఘ అధ్యక్షుడిగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం భీమవరంలో అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివాసీ ఎరుకుల హక్కుల కోసం, అణగారిన ఎరుకుల కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. శ్రీనివాసరావును వివిధ జిల్లాల అధ్యక్షులు అభినందించారు.





రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన ఆటో.. తీవ్ర గాయాలపాలైన ఆటో డ్రైవర్‌ను అంబులెన్స్ ఎక్కించి పంపుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

కారు..ఆటో ఢీ : ఇద్దరికి గాయాలు

ద్వారకాతిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓ కారు వేగంగా వెళ్తూ ఆటోను ఢీకొన్న ప్రమాద ఘటనలో తీవ్రగాయాల పాలైన ఇద్దరిని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అంబులెన్స్‌లో ఆసుపత్రికి పంపారు. మండలంలోని లక్ష్మీనగర్ రాష్ట్రీయ రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు తన కారు ఆపి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.



వెలగలపల్లి సమీపంలో చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు : పలువురికి గాయాలు

చింతలపూడి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం వెలగలపల్లి శివారు ఊరచెరువు సమీపంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సత్తుపల్లి ఆర్టీసీ డిపో బస్సు ఏలూరు వెళ్తుండగా బస్సు గోతులో పడి అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. సత్తుపల్లి నుంచి ఉదయం ఏలూరు వెళ్తున్న ఈ బస్సులో 30 మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 13 మందికి గాయాలయ్యాయి. నలుగురిని మెరుగైన చికిత్సకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స తీసుకుని వెళ్ళిపోయారు. బస్సు డ్రైవర్ నర్సింగరావును ప్రశ్నించగా బస్సు అదుపు తప్పి స్టీరింగ్ కంట్రోల్ కాకపోవడంతో చెట్టును ఢీకొందని, స్వల్ప గాయాలైన వారిని 108లో ఆసుపత్రికి పంపించామని తెలిపారు. మిగతా ప్రయాణికులను వేరే బస్సులో తరలించినట్లు చెప్పారు.

పాముకాటుకు మహిళ మృతి

ఏలూరు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పొలంపనికి వెళ్ళిన మహిళను పాము కాటు వేయడంతో మృతి చెందింది. చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన బొడ్డు వెంకాయమ్మ ఆదివారం ఉదయం కూలీ పని నిమిత్తం పొలం వెళ్లింది. పాముకాటు వేయడంతో గమనించిన తోటి పనివారు ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నిర్మాణంలో ఉన్న ఇంట్లో విద్యుత్ వైర్లు చోరీ

ఏలూరు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం కోసం నూతనంగా నిర్మాణం అవుతున్న ఇంటిలో ఉంచిన కరెంటు వైర్లను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారని బాధితుడు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు శనగపప్పు బజార్ ఐదు దుకాణాల ప్రాంతంలో కనిగొళ్ళ మణి ప్రశాంత్ నూతనంగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఆ ఇంట్లో విద్యుత్ వైరింగ్ నిమిత్తం 11 కట్టల విద్యుత్ వైర్లను తెచ్చి ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్ళి చూసేసరికి కనిపంచలేదు. దీంతో ఆదివారం మధ్యాహ్నం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏలూరు శాంతినగర్‌లో చైన్ స్నాచింగ్

ఏలూరు క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడిచి వెళుతున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు యువకులు తెంపుకుని మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. విజయవాడకు చెందిన అత్తి వెంకటేశ్వరమ్మ (49) ఏలూరు సత్రంపాడులో ఉన్న ఆమె కుమార్తె ఇంటికి ఈనెల 12వ తేదీ రాత్రి బస్సులో వచ్చారు. సత్రంపాడు బ్రిడ్జి వద్ద బస్సు దిగి శాంతినగర్ 13, 14 రోడ్డులలో నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న 20 గ్రాముల బంగారపు గొలుసును తెంపుకుని పారిపోయారు. బాధితురాలు ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై అత్యాచారయత్నం

ఉండి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిరిగా ఉన్న యువతిపై ఒక యువకుడు అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె కేకలు వేయడంతో ఆతను పరారయ్యాడు. దీనిపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పాములపర్రు గ్రామానికి చెందిన వర్రే రాజేష్ ఉండి శివారు గ్రామం నక్కారాజుగుంటకు శనివారం వంటపనివారి కోసం వెళ్లాడు. ఆ ఇంట్లో వున్న 19 ఏళ్ల యువతి బయటకు రాగా మీ అమ్మకోసం వచ్చాను అని చెప్పగా ఆమె బయటకు వెళ్లిందని చెప్పింది.ఆమె ఫోన్ నెంబరు తీసుకుని వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం మళ్లీ వచ్చాడు. ఇంట్లో ఎవరు లేరని తెలుసుకుని యువతిపై అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె కేకలు వేయడంతో అతను అక్కడ నుంచి పారిపోయాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

భార్యపై భర్త కత్తితో దాడి



స్థానికులు నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ శ్రీవేద

పాలకొల్లు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు మండలం అరట్లకట్ట గ్రామంలో శనివారం రాత్రి భార్యభర్తల తగాదాలో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు, పాలకొల్లు రూరల్ ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం యాళ్లబండి వెంకట రమణ, వెంకటేశ్వర్లు భార్య భర్తలు. శనివారం రాత్రి భార్య నిద్రిస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వర్లు కత్తితో దాడిచేసి ఆమె పీకపై గాయపర్చాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో భర్త అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ఆమెను పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆమెకు ప్రాణాపాయం లేదని తెలిపారు. కొంత కాలంగా భార్యభర్తలిద్దరూ గొడవలు పడుతున్నారని ఈక్రమంలోనే ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. నరసాపురం డీఎస్పీ శ్రీవేద సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య భగవానుడికి ప్రత్యేక అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆషాఢ ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామికి సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్ళబండ ఆదినారాయణశర్మ భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపించి రక్షాబంధనాలు కట్టారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావుల బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

బొమ్మిడి సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఉంగుటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): బొమ్మిడి సొసైటీ చైర్మన్‌గా మైలవరపు గోపాల కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం సాయంత్రం సొసైటీలో జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో గోపాలకృష్ణతో పాటు మరో ఇరువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసారు. ఎమ్మెల్యే సోదరుడు పత్సమట్ల భీమరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త సూరత్తుల అయ్యప్ప, వంగా రఘు, బాసిరాజు, మందా శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న సత్యనారాయణ

సొసైటీ అధ్యక్షుడిగా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం

దెందులూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తనపై నమ్మకంతో సీతంపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా ఎంపిక చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండలాధ్యక్షుడు మిల్లుబాబుకు యలమర్తి వీరవెంకట సత్యనారాయణ(శ్రీను)కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సీతంపేట బ్యాంకు కార్యాలయంలో సొసైటీ కార్యదర్శి సరిగే పెద్దిరాజు, మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు అధ్యక్షతన ప్రమాణస్వీకారం చేశారు. బ్యాంక్ మాజీ అధ్యక్షులు పర్వతనేని రామకృష్ణ డైరెక్టర్లుగా తిమ్మన్నగూడెం గ్రామానికి చెందిన నర్రవుల గంగభవాని, సీతంపేటకు చెందిన బాలిన రామ చంద్రరావులు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన చైర్మన్ యలమర్తి శ్రీను మాట్లాడుతూ రైతుల అభివృద్ధి సంక్షేమానికి బాధ్యతగా సీతంపేట బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండలంలోని పలు నూతన బ్యాంక్ అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి, బోడేటి మోహన్‌బాబు, మోత్కూరి నాని, నాగనబోయిన సత్యనారాయణ, పావులూరి దశరథ రామయ్య, పర్సా వెంకట్రావు, రాజా, కొల్లి జ్ఞాన ప్రసాద్, పుసులూరి ప్రసాద్, ముమ్మడి మోహన్‌రావు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుముఖం

ఏలూరుకార్పొరేషన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులు సక్రమంగా వాడుతూ వ్యాయామం చేస్తే వ్యాధులు తగ్గుతాయని ఆయుష్ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బి.వి.ఎం.నగేష్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో డాక్టర్ నగేశ్ 112 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. శిబిరంలో ఆయుర్వేద వైద్య సిబ్బందితో పాటు స్థానికులు సురేష్ కుమార్, మణికంఠ బృందం భక్తులకు సేవలు అందించారు. ప్రతి నెలా రెండవ శనివారం ఇదే ప్రాంతంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు క్యాంపు నిర్వాహకులు మానేపల్లి రామారావు తెలియజేశారు.

ఏలూరులో నేడు ఒకపూట ట్రేడ్‌బంద్

ఏలూరు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): హోల్‌సేల్, రిటైల్ షాపులకు నిత్యావసరాల ఎగుమతి, దిగుమతి, తోలకం కార్యకలాపాలకు సంబంధించి ఇప్పుడున్న ముఠాకూలీ చార్జీలను కొనసాగించడం లేదా తగ్గించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం మధ్యాహ్నం 12గంటల వరకు ఏలూరు పట్టణ ట్రేడ్‌బంద్ నిర్వహిస్తున్నట్టు ఏలూరు మర్చంట్స్ ఛాంబర్ చైర్మన్ నేరెళ్ల రాజేంద్ర తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక ముఠాకూలీలను పట్టణంలో వసూలుచేస్తున్నారని, దీనివల్ల వస్తువు విలువ ధరలు పెరిగి, వినియోగదారులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వాస్తవానికి విజయవాడలో వసూలుచేస్తున్న ముఠాకూలీల ధరలకంటే ఏలూరులో ఎక్కువగా ఉన్నాయన్నారు. కూలీధరల విషయంపై ఇప్పటికే ఎమ్మెల్యే బడేటి చంటి కార్మికసంఘాలు, ముఠాకూలీలతో చర్చలు జరిపారని, ట్రేడర్ల తరపున మర్చంట్స్ ఛాంబరు ప్రతినిధులను సోమవారం ఉదయం చర్చలకు రమ్మని ఆహ్వానించారని తెలిపారు. ఎమ్మెల్యేవద్దకు ట్రేడర్లందరూ తరలివెళ్లి సమస్యను వివరించేందుకు వీలుగా సోమవారం మధ్యాహ్నం వరకు ట్రేడ్‌బంద్‌ను పాటిస్తున్నట్టు వివరించారు. ఎమ్మెల్యేతో చర్చల అనంతరం తదుపరి కార్యాచరణపై ట్రేడర్లతో చర్చించి ప్రకటిస్తామన్నారు. పట్టణంలో 600లకుపైగా హోల్‌సేల్, రిటైల్ దుకాణాలున్నాయన్నారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసి దాదాపు నెలరోజులు కావస్తున్న నూతన పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులకు కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారించి, పొజిషన్ ఐడీలను విద్యాశాఖ కమీషనరేట్ కేటాయించడంలో అలసత్వం వహించడం వల్ల బదిలీపొందిన టీచర్లంతా జూన్ నెల జీతభత్యాలను ఇప్పటికీ అందని దుస్థితి నెలకొందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల జీతాలు పొందలేని ఉపాధ్యాయులు రుణాలు, అప్పులకు నెలవారీ వాయిదాలను కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మెగా పీటీఎం నిర్వహణపై అధికారులకు ఉన్న శ్రద్ధ టీచర్ల జీతాలపై లేకపోవడం విచారకరమన్నారు.



మార్నింగ్ వాకర్స్ జనరల్ బాడీ సమావేశం

ఏలూరు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి):అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం వాకర్స్ అధ్యక్షులు ప్రత్తిపాటి నాగ విఘ్నేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఇటీవల స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహం చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ వేయించాలని నిర్ణయించారు. వాకర్ అసోసియేషన్ ద్వారా సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎస్ఎం అక్బర్, విశ్వనాథ్ మాధవరావు, కొమ్మా నాగరాజు, మహిళా అధ్యక్షురాలు మేరి మాణిక్యం, జల్లా వీరభద్రరావు, జంపా సూర్యనారాయణ, ఏసుబాబు, సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణ, ఎస్‌కె సత్తార్, పెద్దపాటి జగదీష్, నజీర్, ఎస్.కె.లాలు సాహెబ్, బీఎస్ఎన్ఎస్ సాంబశివరావు, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

సింగగూడెంలో కమ్యూనిటీ హాలుకు ఎంపీ శంకుస్థాపన

దెందులూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సింగగూడెం సీతంపేట, కొమిరేపల్లి గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చింతమనేనితో కలిసి పరిష్కరిస్తానని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. దెందులూరు మండలం సింగగూడెంలోని రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించనున్న మల్టీ పరపస్ కమ్యూనిటీ హాలుకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీతలతో కలిసి ఎంపీ శంకుస్థాపన చేశారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, సీతంపేట బ్యాంక్ అధ్యక్షులు యలమర్తి శ్రీను, పార్టీ నాయకులు పర్వతనేని రామకృష్ణ యదవ సంఘం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. నాలుగు మండల నాయకులు, అధికారులు సింగగూడెం యదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పట్టిసీమలో ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి వరద

శాంతించింది!

(5వ పేజీ తరువాయి)

శ్రమించారు. ప్రస్తుతానికి గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ అధికారులు ప్రజలను తరలించే విషయంలో రాజీపడకుండా దగ్గరుండి మరీ గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. ఆర్డీవో ఆదివారం కూడా ఇక్కడే ఉండి ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలను తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద : పోలవరంలో గోదావరి వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆదివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి, గోదావరి లంక భూములు నీటమునిగాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు మూసి వేయడంతో వరద జలాలు స్లూయిజ్ గేట్లను ముంచెత్తాయి.

నెరవేరని లక్ష్యం..

- తడి, పొడి వ్యర్థాల సేకరణలో విఫలం
- జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో పారిశుధ్య సిబ్బంది కొరత
- పర్యవేక్షణ లోపంతో ప్రజాధనం వృథా



జంగారెడ్డిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని మార్పులు తీసుకొస్తున్నా కింది స్థాయిలో మాత్రం అది అమలు కావడంలేదు. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడంలో విఫలమైంది. వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని నిబంధన ఉండగా పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి అంతా కలిపే సేకరిస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు రూ.లక్షలు ఖర్చుచేసి పట్టణంలో ఉన్న ప్రతి ఇంటికీ తడి వ్యర్థాలను వేయడానికి ఆకుపచ్చ, పొడి వ్యర్థాలను వేయడానికి నీలి రంగు ప్లాస్టిక్ డబ్బాలను 2021లో అందజేశారు. కానీ ఇప్పటికీ ప్రజలెవ్వరూ తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయడం లేదు. మునిసిపాలిటీ తరఫున ఇచ్చిన డబ్బాలను సొంతానికి వాడుకుంటున్నారే తప్ప తడి, పొడి చెత్త వేయడానికి ఉపయోగించడం లేదు. దీంతో రూ.లక్షలతో కొనుగోలు చేసి ప్రజలకు అందజేసిన ప్లాస్టిక్ డబ్బాల వల్ల ఉపయోగం లేకుండాపోయింది. అంతే కాకుండా తడి, పొడి వ్యర్థాలపై మున్సిపల్ అధికారులు కూడా ఏ మాత్రం ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ప్రజల ఇళ్ల నుంచి చెత్తను సేకరించడంలో అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

పారిశుధ్య సిబ్బంది కొరత

ఏళ్ల తరబడి జంగారెడ్డిగూడెం పట్టణంలో పారిశుధ్య సిబ్బంది కొరత తీరడం లేదు. 2011లో మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఎంతమంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారో ఇప్పటికీ దాదాపు అంతే మంది ఉన్నారు. పట్టణంలో జనాభా శాతం విపరీతంగా పెరుగుతున్నా పారిశుధ్య కార్మికులను పెంచే విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పట్టణంలో 20 వేల కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 65 వేల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రతీ ఐదు వందల మందికి ఒక పారిశుధ్య కార్మికుడు చొప్పున పట్టణంలో 130 మంది కార్మికులు ఉండాలి. ప్రస్తుతం 90 మంది కార్మికులు మాత్రమే ఉన్నారు. దీంతో పట్టణంలోని ఇళ్ల నుంచి వ్యర్థాలు సేకరించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి మాత్రమే ఇళ్ల నుంచి వ్యర్థాలు సేకరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న తొంభై మందిలో కొందరు వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. దీంతో సిబ్బంది కొరత వల్ల పట్టణాన్ని సంపూర్ణంగా పరిశుభ్రంగా ఉంచలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కోసం ప్రతిపాదనలు పంపాం

కె.వి.రమణ, మునిసిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం



పట్టణంలో ప్రతి రోజూ 36 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పట్టణంలో తడి, పొడి చెత్తను రాజుల కాలనీలో మాత్రమే సేకరిస్తున్నాం. మిగతా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించిన తర్వాత సేకరిస్తాం. జనాభా లెక్కల ప్రకారం పట్టణంలో మరో 40 మంది పారిశుధ్య కార్మికులు ఉండాలి. 36 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించుకోవడానికి ప్రభుత్వ అనుమతి కోసం నివేదికలు పంపించాం. అనుమతి రావలసి ఉంది. రాగానే మరో 36 మంది సిబ్బందిని నియమించి పట్టణంలో పారిశుధ్యానికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఘనంగా అమ్మవార్లకు ఆషాఢ సారె అందజేత

సందడిని సంతరించుకున్న ఆలయాలు

పెదపాడు/ జీలుగుమిల్లి/ ఏలూరు కార్పొరేషన్ /దెందులూరు/ఉంగుటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రామచంద్ర పురం రామాలయం యూత్, గ్రామ కమిటీ ఆధ్వర్యం లో గంగానమ్మకు అషాఢ మాసాన్ని పురస్కరించు కుని సారె అందజేశారు. జీలుగుమిల్లి గ్రామంలో ముత్యాలమ్మకు మహిళలు 108 బిందెలతో జలాభిషేకం చేశారు. ఆయా ఆలయాల వద్ద టీడీపీ, జనసేన పార్టీల నాయకులు సుంకవల్లి సాయి, పసుపులేటి రాము అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. ఏలూరులోని బావిశెట్టివారిపేట నాగేశ్వరపురం చెరువు గట్టు వద్ద ఉన్న శ్రీగణేష్ కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు శాకంబరి అలంకారం నిర్వహించారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామ దేవత శ్రీపాటిమ్మ తల్లికి పెరుగుగూడెం నుంచి అషాడం సారెను దేవస్థానం చైర్మన్ యలమర్తి వీరవెంకటసత్యనారాయణ(శ్రీను), హేమలత దంపతులు అందజేశారు. ఉంగుటూరు భద్రకాళి అమ్మవారికి ఆదివారం బెంగళూరుకు చెందిన భక్త బృందం దర్శించుకుంది. గ్రామ తూర్పు కాపు సంఘ భక్తులు ఊరేగింపుగా వచ్చి ఆషాడం సారెను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జీలుగుమిల్లిలో సారె అందజేసిన మహిళలు

ముస్లింలు అన్ని రంగాల్లో రాణించాలి

జీలుగుమిల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ముస్లింలు విద్య, ఆర్థిక రాజకీయ రంగాల్లో రాణించాలని, వెనకబాటుతనం, వివక్షతకు గురికాకుండా ఆత్మగౌరవాన్ని పెంచుకోవాలని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ సభ్యులు షేక్ ముస్తఫా అన్నారు. ములగలంపల్లిలో ఆదివారం ముస్లిం సోదరులు సమావేశం నిర్వహించారు. ముస్లిం పిల్లలు ఉన్నత చదువులకు వెళ్లినవారు తక్కువ శాతం ఉన్నారన్నారు. సమీప గ్రామాల్లో మసీదుల వద్ద సమావేశాలు చైతన్యం తేవాలని అన్నారు. షేక్ బాజీ, షేక్ యాకూబ్, ముస్తక్ అహ్మద్, మహ్మద్‌నబీ, షఫీ, బాషి, ఖలేస్, జహంగీర్, సిలార్, ఇబ్రహీం, ఇమామ్, తదితరులు ఉన్నారు.

టీడీపీ వార్డు కమిటీలకు దిశానిర్దేశం

జంగారెడ్డిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ సూచించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పట్టణంలోని టీడీపీ వార్డు కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలను త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు,నాయకులు బొబ్బర రాజ్‌పాల్ కుమార్, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, కోటగిరి ప్రమీల, కంపా రాజేంద్ర, చేను ప్రసాద్, గెడా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



జంగారెడ్డిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): శ్రవణా నక్షత్రం సందర్భంగా గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లూరు రవి కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. పట్టణానికి చెందిన హరే శ్రీనివాస భజన మండలి సభ్యులు కోలాట ప్రదర్శన నిర్వహించినట్టు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, సభ్యులు పాల్గొన్నారు.



పద్మశ్రీకి కేక్ తినిపిస్తున్న ఎంపీ మహేశ్

ఘనంగా జడ్పీ చైర్‌పర్సన్ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరుసిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో జడ్పీ చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, జడ్పీ కార్యాలయ ఉద్యోగులు, అభిమానులు పాల్గొని పద్మశ్రీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రేమ వివాహం.. వివాదం

యువకుడి ఇంటిపై యువతి బంధువుల దాడి

ఫిర్యాదుతో 12 మందిపై పోలీసుల కేసు

జంగారెడ్డిగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): దేవులపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి ప్రేమ వివాహమై గందరగోళం చోటు చేసుకుంది. నూతనంగా వివాహం చేసుకున్న జంట ఇంటిపై యువతి బంధువులు దాడిచేసి యువతిని కిడ్నాప్ చేసిన ఘటనపై లక్కవరం పోలీసులు కేసు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లికి చెందిన బెజవాడ రమేశ్, పెదవేగి మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల గంగోత్రి ప్రేమించుకుని ఈ నెల 11న ఏలూరులో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. దేవులపల్లిలో అదే రోజు అర్ధరాత్రి అంతా నిద్రిస్తున్న సమయంలో యువతి తల్లి, అన్నతో కలిసి మరికొంత మంది వచ్చి రమేశ్ ఇంటిపై దాడి చేసి యువతిని బలవంతంగా కారులో తీసుకెళ్లారు. దాడిలో పాల్గొన్న ముగ్గురినీ గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇంటిపై దాడి చేసి తన భార్యను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లిపోయారని యువకుడు రమేశ్ లక్కవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ సుభాష్ ఆధ్వర్యంలో ఎస్.ఐ. శశాంక యువతిని గుర్తించి తీసుకొచ్చారు. యువతి మేజర్ కావడంతో ఆమె ఎక్కడ ఉంటానంటే అక్కడకే పంపుతామని సీఐ తెలిపారు. ఈ ఘటనలో 12 మందిపై కేసు నమోదు చేశారు.

బీసీల మధ్య గొడవలు సృష్టించొద్దు

చింతలపూడి, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీల మధ్య గొడవలు సృష్టిస్తే ఊరుకు నేది లేదని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కొమ్మరాజు సత్యనారాయణ వైసీపీని హెచ్చరించారు. కులాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే నీచమైన సంస్కృతిని మాజీ మంత్రి పేర్ని నాని పెంచిపోషిస్తున్నారని, రేషన్ బియ్యం చోరీ కేసులో కుటుంబ సభ్యులను జైలుకు పంపిన వ్యక్తి అంటూ దుయ్యబట్టారు. అలాంటి వ్యక్తి మంత్రి లోకేశ్ గురించి మాట్లాడితే సహించేది లేదన్నారు. గత ఎన్నికల్లో ఓడించినా ఇంకా బుద్ధిరాలేదన్నారు.



మహిళల మరుగుదొడ్డికి వేసి ఉన్న తాళం

ఆత్మగౌరవంతో వ్యాపారమా?

మరుగుదొడ్ల వద్ద నిర్బంధపు వసూళ్లు

పోలవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పోలవరం నుంచి కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు పట్టణాలకు ప్రయాణాలు చేసే మహిళల ఆత్మగౌరవంతో బస్టాండులో మరుగుదొడ్లు నిర్వహించే కాంట్రాక్టర్లు వ్యాపారాలు చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పోలవరం మహిళలు వాపోతున్నారు.కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు బస్టాండుల్లో ఉన్న మరుగుదొడ్లను వినియోగించడానికి రూ.10 బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని, ఇదే విషయంపై బస్టాండు కంట్రోలర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని మహిళా ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. జంగారెడ్డిగూడెం బస్టాండులో ఉచిత మూత్ర విసర్జనకు నిర్మించిన టాయిలెట్లకు మరుగుదొడ్ల నిర్వహకులు తాళాలు వేసి తాము నిర్వహించే మరుగుదొడ్ల వినియోగం చేసుకునేలా చేసి మనిషి వద్ద నిర్బంధ వసూళ్లు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మహిళలు, విద్యార్థినులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

టి.నర్సాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. బండివారిగూడెంలో మేడిద సుబ్బయ్య ట్రస్టు ఆధ్వర్యంలో నేనున్నాను గ్రూపు అధ్యక్షులు డాక్టర్ మేడిద వెంకటేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాణా వేల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు కొవ్వాడ విశ్వనాథచారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి

కుక్కునూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సీపీఎం, సీపీఐ, వైసీపీ, కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరులో అఖిల పక్ష నాయకులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏజెన్సీ ప్రాంతమంటే ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని నాయకులు ఆరోపించారు. కుక్కునూరు ఎంఈవో బాబూరావు విధుల్లో బాగంగా పాఠశాలలు సందర్శించడం లేదని, ఉపాధ్యాయుల బదిలీ సందర్భంలో ఇక్కడ కొత్తగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీకాకుండా ఎందుకు రిలీవింగ్ ఇచ్చారని విమర్శించారు. జూలై 16, 17 తేదీల్లో ఉపాధ్యాయ సమస్యలపై రిలేనిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, వై.నాగేంద్రరావు, కొన్నే లక్ష్మయ్య, చంటి నాయుడు, వై.సాయికిరణ్, వడ్డే రఘు, రాజులు పాల్గొన్నారు.

పేకాడుతున్న జూదరుల అరెస్టు

లింగపాలెం, జూలై13(ఆంధ్రజ్యోతి): పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురు జూదరులను అరెస్టుచేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యడవల్లిలో పేకాడుతున్నారనే సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి ఐదువేల ఐదు వందల రూపాయల నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

ప్రజలకు చేరువయ్యేలా సుపరిపాలన

ఏలూరు టూటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 44వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ వర్షాకాలంలో ఇబ్బంది రాకుండా డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

● కామవరపుకోట: చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌లు ఆదివారం రాత్రి కామవరపుకోట మండలం ఉప్పలపాడు, రామన్నపాలెం పంచాయతీ కొత్తూరు తదితర గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు కూటమినాయకులు, కార్యకర్తలు కోలాహలంగా పాల్గొన్నారు.

● లింగపాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యేలా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం లింగపాలెం మండలంలో ఉత్సాహంగా కొనసాగింది. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు నాయకత్వంలో పారదర్శకంగా సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు అందిస్తున్నారని అన్నారు.

● ద్వారకాతిరుమల: తిమ్మాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం టీడీపీ సీనియర్ నేతలు పోలిన శ్రీనివాసరావు, ఘంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మటపర్తి బద్రి, ఏపూరికిషోర్, బొట్లసాయి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన లయన్స్ సభ్యులు

లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవం

కామవరపుకోట, జూలై 13(ఆంధ్రజ్యోతి) : జీలకర్రగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఇనస్టలేషన్ అధికారి వి.కె.పంకజాక్షన్, ఇండక్షన్ అధికారిగా సత్యస్వరూప్‌లు వ్యవహరించారు.ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఆర్.ఆర్.రంగరాజు, కార్యదర్శి ఎస్.ఆర్.ఆర్.యర్రంరాజు,రీజనల్ చైర్‌పర్సన్ ఆర్.ఆర్.రత్న కుమారిలతో పాటు జీలకర్రగూడెం, టి.నర్సాపురం, ప్రగడవరం, యర్రంపల్లి, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, భీమవరం లయన్స్ క్లబ్‌ల సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల, జూలై 13(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయంలో నిర్వహించే విద్యాదాన ట్రస్టుకు ఓ దాత లక్ష రూపాయల విరాళంగా అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం మల్లవరానికి చెందిన కె.వెంకట్రాజు, హైమావతి దంపతులు ఈ విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే బొలిశెట్టి

ద్వారకాతిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు, దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీ ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి పెదపాడు వద్ద ఒక ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనాన్ని, అందులోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని, వాహన యజమాని, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



గుబ్బల మంగమ్మ ఆలయం కిటకిట

బుట్టాయగూడెం, జూలై 13(ఆంధ్రజ్యోతి): అడవి బిడ్డల ఆరాధ్య దైవం శ్రీగుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలు

ద్వారకాతిరుమల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యత, ప్రమాణాలతో సరుకు అందించాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని.. మోసానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలుంటాయని తూనికలు, కొలతల శాఖ అధికారి జీవీ ప్రసాద్ హెచ్చరించారు. ద్వారకాతిరుమలలోని పలు మాంసం దుకాణాలను అధికారులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడు షాపులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని గుర్తించి వాటిపై కేసు నమోదు చేశారు. తరచూ ఈ తనిఖీలు ఉంటాయని వ్యాపారులు ఖచ్చితమైన తూకాన్ని, నాణ్యమైన సరుకును వినియోగదారులకు అందించాలని కోరారు.

శాకంబరిగా అన్నపూర్ణ

కామవరపుకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాసం నేపథ్యంలో ఉప్పలపాడు పంచాయతీలోని అన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు వివిధ రకాల కూరగాయలతో శాకంబరి అలంకరణ చేసి ఆలయ అర్చకులు ఇలపర్తి శివ రామయ్య ప్రసాద్ భక్తులకు దర్శనమిచ్చారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సీతారామనగరం శివారుల్లో సారా తయారీపై సీఐ ఎం.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ఈ దాడిలో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

నలుగురిపై కేసు

టి.నర్సాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పొలం విషయంలో ఇరు వర్గాలు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన మంతెన నరసింహరావుకు, కలపర్తి రామకృష్ణకు గత కొంత కాలంగా భూమి విషయంలో వివాదం నడుస్తోంది. మంగళగిరికి చెందిన కాతారి శ్రీనివాసరావుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని ఈ నెల 9న కలపర్తి రామకృష్ణ మెస్ వేసి ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతుండగా మంతెన నరసింహరావు, మంతెన రామ్మూర్తి వచ్చి ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇరు వర్గాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

బాబు హామీలపై వంకా గరంగరం

ఏలూరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబు హామీలకు ష్యూరిటీ లేదని, మోసాలే గ్యారెంటీ అని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కారుమూరి సునీల్ కుమార్, కె.విజయరాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల అందజేత

పెదవేగి. జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడమే పీ4 కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మొండూరులో బలుసుదీపు శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.3 లక్షల విలువైన 7 రీఛార్జిబుల్ ట్రైసైకిళ్లను పంచాయతీ పరిధిలోని విభిన్న ప్రతిభావంతులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వైద్య శిబిరంలో 387 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ముదినేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు పాల పొంగళ్లు తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన డి.కృష్ణబాబు, సుప్రియ దంపతులు దేవస్థానంలో అన్నదానానికి రూ.10,116 విరాళం అందజేశారు. దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

లక్ష్మీనరసింహస్వామికి మంత్రి సారథి పూజలు



నూజివీడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సతీసమేతంగా ఆదివారం దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆయన మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆదేవుడిని కోరుకున్నామన్నారు.

పచ్చిరొట్ట విప్లవం

చాట్రాయి మండలంలో వరినాట్లు ముమ్మరం



బూరుగుగూడెంలో పచ్చిరొట్టను ట్రాక్టర్‌తో దున్ని దమ్ము చేస్తున్న రైతు

చాట్రాయి, జూలై 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో పచ్చిరొట్ట విప్లవం కొనసాగుతుంది. ఖరీఫ్‌లో దాదాపు రైతులందరూ పచ్చిరొట్ట సాగు చేస్తుండడం విశేషం. మండలంలో చాట్రాయి, బూరుగుగూడెం, ఆరుగొలనుపేట తదితర గ్రామాల్లోని రైతులు పచ్చిరొట్ట భూమిలో కలియ దున్న ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ప్రభుత్వం 50శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తుండగా, ఇక్కడ పచ్చిరొట్ట విత్తనాలు దొరక్కపోతే రైతులు తెలంగాణ ప్రాంతానికి వెళ్లి తెచ్చి సాగు చేస్తున్నారు. ప్రతిరైతు తప్పనిసరిగా పచ్చిరొట్ట సాగు చేసి భూములను సారవంతం చేసుకుంటున్నారు. మండలంలో 112 సాగునీటి చెరువుల కింద 11,200 ఎకరాలు వరిసాగు భూమి ఉండగా 80 శాతం భూములలో పచ్చిరొట్ట సాగు కావడం గమనార్హం. వ్యవసాయాధికారుల సూచనలు మేరకు పచ్చిరొట్ట సాగు చేసి దున్ని అధిక దిగుబడులు సాధించేందుకు ఉపయోగపడుతుందని రైతులు తెలుపుతున్నారు.

కోతులు, శునకాలతో అవస్థలు

భయపడుతున్న నూజివీడు వాసులు



నూజివీడు ఆర్డీవో కార్యాలయంపై కోతులు

నూజివీడు టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోతులు, శునకాలు పేరు చెబితే నూజివీడు వాసులు భయపడుతున్నారు. గుంపులు, గుంపులుగా వానరాలు స్వైర విహారం చేస్తుడడంతో పలువురు పట్టణ వాసులు గాయాలపాలవుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. కోతుల బెడద నుంచి రక్షించాల్సిందిగా పట్టణ వాసులు వేడుకుంటున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పూర్తిస్థాయిలో పడడం లేదు. పట్టణంలోని బంగినపల్లితోట, అమ్మవారి తోట, స్టేషన్, ఆర్డీవో కార్యాలయం, ట్రిపుల్ ఐటీ తదితర ప్రాంతాల్లో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. ఇక నూజివీడు ఎంఆర్ఎఫ్ కాలనీ ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రాంతాలలో కుక్కలు బెడదతో పట్టణవాసులు అవస్థలు పడుతున్నారు.

మునిసిపల్ అధికారుల ప్రయత్నాలు విఫలం..

కోతుల దాడిని అరికట్టేందుకు నూజివీడు మునిసిపల్ అధికారులు వినూత్న రీతిలో చింపాజీ దుస్తులతో ఇరువురి సిబ్బందిని నియమించారు. ఆ ప్రయత్నం నిరుపయోగంగా మారింది. కోతులను తోలేందుకు శబ్దాలు చేసే గన్‌లను రప్పించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. కోతులను పట్టి తరిమేలా.. శునకాలను పట్టి వాటి సంతతి పెరగకుండా నిరోధించడంతో పాటు అటవీ ప్రాంతాలకు తరలించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కమ్యూనిటీ హాలుకు కొత్త రూపు

పంచాయతీ నిధులతో అభివృద్ధి



కళగా ఉన్న కమ్యూనిటీ హాలు(ఇన్‌సెట్‌లో) మరమ్మతులు చేపట్టక ముందు భవనం

ముదినేపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాలు నూతన రూపు సంతరించుకుంది. సుమారు పదేళ్లుగా వినియోగంలో లేక పాడుబడిపోయి నిరుపయోగంగా ఉన్న ఈ కమ్యూనిటీ హాలు భవనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ఈ భవనాన్ని సామాజిక అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. 1995లో అప్పటి శాసనసభ్యురాలు ఎర్నేని సీతాదేవి ఈ కమ్యూనిటీ హాలును నిర్మించారు. సుమారు 20 ఏళ్ల పాటు ఈ కమ్యూనిటీ హాలును ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు వినియోగించారు. నిర్వహణ లోపంతో పాడైపోయిన ఈ భవనం గత పదేళ్లుగా మూతబడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే గ్రామానికి చెందిన కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు చొరవ తీసుకుని కమ్యూనిటీ హాలును రూ.లక్షా 20 వేల గ్రామపంచాయతీ నిధులతో అభివృద్ధి చేయించారు. దీంతో ఈ హాలుకు కొత్త కళ వచ్చింది.



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామ పెద్దలు

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.6 లక్షలు సాయం

కలిదిండి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మూల్లంక గ్రామానికి చెందిన కేతసాయి, తుట్టా నాగరాజు నెల్లూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులకు ఆసరా కోసం విరాళాల ద్వారా సేకరించిన రూ.6లక్షలు రూపాయలను ఒక్కొక్క కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున మాజీ ఎంపీపీ బండి తులసీరావు, పిల్లి గణేష్ ఆదివారం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గన్నారు.



పూర్ణాహుతి హోమాన్ని నిర్వహిస్తున్న ఉదయశంకర్ దపతులు

దత్తాశ్రమంలో పూర్ణాహుతి

మండవల్లి జూలై 13(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం లోకుముడి దత్తాశ్రమంలో కోటి దత్తహోమం పూర్ణాహుతి కార్యక్ర మాలను ఆదివారం నిర్వహించారు. యాగ్నికులు తరుణ్, రోహిత్ శర్మ ఆధ్వర్యంలో మూర్తి పర్యవేక్షణలో రాష్ట్రం నలుమూలలు నుంచి వచ్చిన రుత్వికుల సహకారంతో కోటి దత్తహోమం జరిగింది. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయశంకర్ కనకదుర్గ దంపతులు యాగకర్తలుగా వ్యవహరించారు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చాట్రాయి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.గుడిపాడులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం గ్రామంలో సాయంత్రం ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్ట్ చేసి రూ.6200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కైకలూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి):మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆలపాడు గ్రామానికి చెందిన బొర్రా వెంకట మధుబాబు (23) ఈనెల 7వ తేదీన ఎలుకలమందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మేరి అనే యువతిని ఏడాదిన్నర క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజులుగా ఇద్దరి మధ్యలో మనస్పర్థలు రావడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 7న ఆమె పుట్టింటికి వెళ్లడంతో, అదే రోజు ద్విచక్ర వాహనాన్ని ఫైనాన్స్ కట్టలేదని కంపెనీ వారు తీసుకువెళ్లారు. ఈ రెండింటిపై మనస్తాపం చెంది ఎలుకలమందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడు తండ్రి బొర్రా లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



భుజబలపట్నంలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు త్రినాథరాజు, డీసీ చైర్మన్ వాసురాజు



మట్టగుంటలో సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



ముసునూరు ఎస్సీకాలనీలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టీడీపీ మండల అధ్యక్షుడు త్రినాథరాజు
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు

కైకలూరు/కలిదిండి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. ఆదివారం కైకలూరు మండలం భుజబలపట్నం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ కూటమి పాలనలో సూపర్-6 పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, మంతెన రామరాజు, జంపన శ్రీను, జంపన రవి, తదితరులు పాల్గొన్నారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో అగ్నికుల



తోటపల్లిలో ఇంటింటికి కరపత్రాలు అందిస్తున్న శ్రీనివాసరావు

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు వడుగు గణపతి, తిరుమలశెట్టి పరశురాముడు, కొపనాతి రాము, మోకా పెద్దిరాజు పాల్గొన్నారు. కలిదిండిలో 223 బూత్‌లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు పులి వెంకటేశ్వరరావు, ఎండి.ఫరూక్, పోసిన పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

● ముసునూరు/ఆగిరిపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఉంటుందని నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), టీడీపీ గ్రామ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం ముసునూరు ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. బాబి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి టీడీపీ ప్రభుత్వ పాలనతోనే సామర్థ్యమన్నారు. నాయకులు నక్కా యోహాను, కలపాల రాము, తేమరాజు తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో మంత్రి కొలుసు పార్థసారథి నాయకత్వంలో తోటపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశామని నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు అన్నారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చామన్నారు. వల్లూరి ప్రదీప్‌కుమార్, ఆరేపల్లి సాయికృష్ణ, ఆరేపల్లి నవీన్‌కుమార్, పరిమి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలం, పిన్నమరెడ్డిపల్లిలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కంపటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.



నూతన మోటారును బిగిస్తున్న దృశ్యం

ఎస్సీకాలనీకి తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ముసునూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట ఎస్సీ కాలనీకి తాగునీటి సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. ఈ కాలనీలో 20 రోజుల క్రితం మోటారు కాలిపోయి, తాగునీటి సమస్య తలెత్తింది. సర్పంచ్ పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. కాలనీవాసులకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడంతోపాటు నిరుయోగంగా ఉన్న చేతిపంపును వినియోగంలోకి తీసుకువచ్చారు. ఆదివారం ఎంపీడీవో బీప సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ మోటారును బిగించారు. ఎస్సీకాలనీలో తాగునీటి ఇబ్బందులు తొలగాయి.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కలిదిండి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీషు సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ త్రినాథ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, గతంలో అధ్యాపకుడిగా పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన వారు సంబంధిత అర్హత నకలు కాపీలను, రెండు పాస్‌పోర్టు ఫొటోలను జతపరిచి ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటల లోపు కళాశాలలో సమర్పించాలన్నారు. 15వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఆగిరిపల్లి గ్రంథాలయం అధికారిగా కుమార్

ఆగిరిపల్లి, జూలై13(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి గ్రంథాలయం అధికారిగా ఈడే కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డి.నాగేశ్వరరావు విజయవాడకు బదిలీ అయ్యారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ గ్రంథాలయంలో పనిచేస్తున్న కుమార్ బదిలీపై వచ్చారు.



చినపాలపర్రులో ఎక్స్‌కవేటర్‌తో చానల్ తవ్వకం పనులు

స్వచ్ఛందంగా కాలువ తవ్వకం పనులు

ముదినేపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): సాగునీరందక భూములను దుక్కులు చేసుకునేందుకు అవకాశం లేని పరిస్థితుల్లో రైతులే స్వచ్ఛందంగా పంట కాలువ తవ్వకం పనులు చేపట్టారు. చినపాలపర్రు గ్రామ ఏరియాలోని వందలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే చినపా లపర్రు చానల్ (నల్ల కాలువ) శివారున పూడిపోవటం, వెడల్పు తగ్గిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. చాలా మంది రైతులు మురుగునీటిని ఆయిల్ ఇంజన్లతో నీరు తోడుకుని నారుమళ్లను కాపాడుకుంటున్నారు. ఇరిగేషన్ శాఖ అధి కారులు కాలువ తవ్వకం చేపట్టే అవకాశం కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో చినపాలపర్రు రైతులే విరాళాలతో స్వచ్ఛందంగా కాలువ తవ్వకం పనులను ఆదివారం నిర్వహిస్తున్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న మండవ ఫౌండర్స్ దంపతులు

233 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని ఎంపీడీవో బి.భార్గవి అన్నారు. రమేష్ హాస్పిటల్స్ విజయవాడ, మండవ ఫౌండేషన్ ఫౌండర్స్ మండవ వెంకట్రామయ్య, రమాదేవి దంపతుల సహకారంతో ఆగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఆగిరిపల్లి హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 233 మందికి కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, న్యూరాలజిస్ట్, ఆప్తమాలజీ, డెంటల్, గైనకాలజీ, బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. మండవ ఫౌండేషన్ పీ4 కో-ఆర్డినేటర్ బి.సుబ్బారావు, హైస్కూల్ ఉపాధ్యాయులు, ఆశా వర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతించింది!



వరద నీటి మధ్య పట్టిసీమ శివక్షేత్రం

(5వ పేజీ తరువాయి)

శ్రమించారు. ప్రస్తుతానికి గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికి అధికారులు ప్రజలను తరలించే విషయంలో రాజీపడకుండా దగ్గరుండి మరీ గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. ఆర్డీవో ఆదివారం కూడా ఇక్కడే ఉండి ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలను తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు

పోలవరంలో గోదావరి వరద జలాలు ఉధృతంగా ప్రవహిసున్నాయి. ఆదివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి, గోదావరి లంక భూములు నీటమునిగాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద గేట్లు మూసివేయడంతో వరద జలాలు స్లూయిజ్ గేట్లను ముంచెత్తాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

వైభవంగా అమ్మవార్లకు ఆషాఢ సారె

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి ఆషాఢమాసం సందర్భంగా కైకలూరుకు చెందిన వందలాదిమంది మహిళలు సారె అందజేశారు. ఆదివారం కైకలూరు బ్రహ్మంగారి గుడి వీధిలోని, వెలమపేటకాలనీకి చెందిన మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈవో వీఎన్‌కే శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండవల్లి మండలం మండవల్లిలో శ్రీగంగానమ్మ, శ్రీభ్రమరాంబ, శ్రీవిజయదుర్గా దేవి అమ్మవార్లకు ఆదివారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. పండితులు చాగంటిపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర, గాజులు, పండ్లు, స్వీట్లు సమర్పించారు. శ్రీగంగానమ్మ అమ్మవారిని అర్చకులు గూడూరు శ్రీనివాసరావు పలురకాల కూరగాయాలతో అలంకరించగా, శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముదినేపల్లి మండలం ముదినేపల్లిలో చినపూరిగా ప్రసిద్ధిగాంచిన వడాలి గ్రామంలోని సుభద్ర, బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానంలో సుభద్రమ్మవారికి ఆదివారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు వందల సంఖ్యలో ఎర్రటి సంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శనగా వచ్చి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. పలు రకాల మిఠాయిలు, పండ్లు, చలిమిడితో కలిగిన సారెను సమర్పిం చారు. దేవస్థానం ఈవో సింగనపల్లి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. నక్కా అప్పారావు ఆధ్వర్యంలో మహిళలు సారె సమర్పించారు. పెదపాలపర్రు గ్రామ ఇలవేల్పు గంగానమ్మకు అర్చకుడు భుజంగ వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో మహిళలు



చాట్రాయిలో కనకదుర్గమ్మకు సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు

పూజలు నిర్వహించి, సారె సమర్పించారు.

● చాట్రాయి, జూలై 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలం చాట్రాయిలోని కనకదుర్గమ్మకు ఆదివారం వందలాది మంది భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, స్వీట్లు మొదలైనవి మహిళలు తలపై పెట్టుకొని దుర్గాదేవి భక్తి గీతాలు ఆలపిస్తూ మంగళ వాయిద్యాలు కోలాట ప్రదర్శనలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు.

● ఆగిరిపల్లి : ఆగిరిపల్లిలో గ్రామ దేవతలైన గంగానమ్మ, అంకమ్మ, పోలేరమ్మ, కనకదుర్గమ్మలకు ఆదివారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు విజయవాడ రోడ్డులోని మాలక్ష్మమ్మ మాను పోతురాజు దిమ్మ నుంచి గ్రామోత్సవం ప్రారంభమై గ్రామ వీధులలో డప్పు వాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు. భక్తులు పాలపొంగళ్లు తయారు చేసి మొక్కు చెల్లించుకున్నారు.

ఆలయాల్లో మాజీ గవర్నర్ కుటుంబసభ్యుల పూజలు

కైకలూరు/మండవల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం మండవల్లి గ్రామస్థుడైన సిక్కిం రాష్ట్రం మాజీ గవర్నర్ దివంగత వెంట్రప్రగడ రామారావు కుమారుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని, మండవల్లిలో భమరాంబ సమేత మల్లేశ్వరస్వామి మల్లేశ్వర స్వామిని దర్శించు కున్నారు. ఆలయ మర్యాదలతో కైకలూరు ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. బీజేపీ నాయకులు కట్టా వీరరాఘవులు, బండి దివాకర్, పంద్రంగి ప్రసాద్, బండి రంగారావు, గుడివాడ గణేష్ తదితరులు ఉన్నారు.



కైకలూరులో సారె తీసుకువస్తున్న మహిళలు



మండవల్లిలో సారె సమర్పిస్తున్న మహిళలు



మండవల్లిలో శ్రీనివాస్ కుటుంబసభ్యుల పూజలు